# పని

వై.కె. మూర్తి

రంగయ్య దొంగతనం చెయ్యడం మానేసి మూణ్ణెల్లయింది. ఈ మూడు నెలల్లో ఎందరి చేతో రంగయ్య మంచివాడు అనిపించుకున్నాడు. కానీ వాడికి అది తిండి పెట్టలేదు. రంగయ్య భార్య లక్ష్మమ్మ మూడిళ్ళల్లో పని చేస్తోంది కాబట్టి వాళ్ళ పొట్టలేకాక, రెండేళ్ళ పసిబిడ్డకి కూడా కాస్త కలోగంజో లభిస్తోంది. మంచివాడైన రంగయ్య ఇంతకుముందు ఆరితేరిన జేబుదొంగ. అతని చేత దొంగతనం మానిపించిన ఘనత పోలీసుల లాఠీలకో, జైలు కటకటాలకో చెందలేదు. ప్రస్తుతం వాడు పైసా కూడా సంపాదించలేకపోతున్నానే అని బాధపడడానికి కారణం ఎవరో కాదు, సాక్షాత్ వాడి భార్య లక్ష్మమ్మ! ఆమె పోరగా పోరగా రంగయ్య ఆమె మీద గల అపారమైన ప్రేమ చేత, తన దొంగ బ్రతుకుకి విసిగి ఇహ దొంగతనం చెయ్యనని ఆమె మీద ప్రమాణం చేసి మూణ్ణెల్ల క్రితం చెప్పాడు. చెప్పడంతో ఊరుకోక ఆచరణలో పెట్టాడు. రంగయ్య దొంగతనం మానెయ్యడం లక్ష్మమ్మకి ఆనందాన్ని కలుగచేసింది. ఆ తర్వాత ఏ పనీ లేక ఇంట్లో కూర్చోలేకపోయిన రంగయ్య ఒక చోట కూలీగా చేరాడు. ఓ రోజు మేస్త్రీ "దొంగవెధవ" అన్నాడన్న కోపంతో ఆ పని మానేశాడు. దొంగతనం మానేసిన తర్వాత ఆ విధమైన మాట పడటం వాడికి మాచెడ్డ అవమానంగా తోచింది. ఆ రోజు వాడెంతో బాధపడ్డాడు. లక్ష్మమ్మ రంగయ్యని ఓదారుస్తు "పోనీలేమావా... ఇంతకన్న మారాజులాంటి పని నీకు దొరుకుతుందిలే" అంది. ప్రభుత్వ బ్యాంకులలో బడుగువర్గాలకి ఋణాలిస్తున్నారని తెలిసి, రిక్షా లోన్‌కి వెళ్ళాడు రంగయ్య. బ్యాంకు అధికారి రంగయ్యను చూసి, ష్యూరిటీగా ఎవరన్నా పెద్దమనిషిని తీసుకురా, లేకుంటే స్థిరాస్తులేవైనా ఉన్నాయా?"

"అంత పెద్దోళ్ళు, ఆస్తులు ఉంటే



అప్పుడుగడావికి కెందుకొస్తాను?'' ఆ విధంగా ఆ ఆశ అడుగంటింది. ప్రతిరోజూ పనికై అక్కడా ఇక్కడా తిరిగివచ్చినట్లే ఆరోజు సాయంత్రం ఇంటికి చేరుకున్నాడు రంగయ్య. ఆ సమయంలో లక్ష్మమ్మ ఇంట్లో ఉండడం వాడికి ఆశ్చర్యాన్ని కలుగజేసింది. ఆమె ఒళ్లో పసిపాప మెలితిరిగిపోతోంది. గాభరాగా బిడ్డని ధర్మాసుపత్రికి తీసుకువెళ్ళాడు. 'ధర్మరాజైన' ఆ డాక్టరు పరీక్షచేసి ఆ పిల్ల కడుపులో రెండు పేగులు ఒక దానితో ఒకటి మెలివేసుకుపోయాయనీ ఆపరేషన్ చేసి వాటిని విడదీయకపోతే ప్రమాదమనీ అన్నాడు. అతనివైపు బేలగా చూశారు, డాక్టర్ చిద్విలాసంగా నవ్వుతూ "రెండొందలిస్తే ఆపరేషన్ 'ఉచితంగా' వెంటనే చేస్తానని చెప్పాడు. రంగయ్య అంత డబ్బు చూసి చాలా రోజులైంది. లక్ష్మమ్మ డాక్టర్ని బ్రతిమాలింది. డాక్టర్ వందరూపాయలకి ఒప్పుకున్నాడు.

'అమ్మగారూ' అన్న పిలుపుకి వెనక్కి తిరిగి చూసింది సూర్యకాంతమ్మ. ఎదురుగా దరిద్ర దేవతలా నిలుచుని ఉన్న లక్ష్మమ్మని చూసి మొహం చిట్లించి, చేతిలోని నోట్ల కట్టలు కిటికీ పక్కనే ఉన్న బీరువాలో పెట్టి తాళం వేసింది. "ఏమిటే ఏంకావాలి?" కసురుకుంది.

లక్ష్మమ్మ పరిస్థితి చెప్పింది. "మాకు మాత్రం డబ్బు మూలుగుతుందనుకున్నావా... ఎంత ఖర్చు.. ఇప్పుడేమీ ఇవ్వలేను. గానీ విసిగించక వెళ్ళు'' అంటూ ఆవిడ అక్కడనుంచి వెళ్ళిపోయింది. ఒక్కసారి ఆ బీరువా వైపు చూసి వెనక్కి తిరిగింది. లక్ష్మమ్మ.

జీవితంలో మొదటిసారిగా తన బ్రతుకు మీద విపరీతమైన రోత కలిగింది రంగయ్యకి. ఆ డబ్బు సంపాదించకుండా ఇంటికి తిరిగి వెళ్ళకూడదని అతను నిశ్చయించుకున్నాడు. ఒకచోట జనం గుంపులు గుంపులుగా ఏదో వినోదం చూస్తూ గుమికూడి ఉన్నారు. ఒక కుర్రాడి పాకెట్‌లోంచి తొంగి చూస్తున్న పర్సు అతని దృష్టిని ఆకర్షించింది. ఏమూలనుంచో, ఎవరో ఇది తప్పని హెచ్చరిస్తున్నట్లుగా అనిపించింది. కాని తన బిడ్డ... పర్సు సునాయాసంగా రంగయ్య చేతుల్లోకి వచ్చింది. ఆ గుంపు దాటబోతుండగా ఆ కుర్రాడి కేకలు - "పర్సు పోయిందండీ అందులో మూడొందలు రూపాయలున్నాయి. పరీక్ష ఫీజు కట్టేందుకు ట్యూషన్ చెప్పి సంపాదించిన డబ్బండీ అది'' కన్నీటి మధ్య మొరపెట్టుకుంటున్నాడు కుర్రాడు. ఆ కుర్రాడి పరిస్థితికి జాలేసింది రంగయ్యకి. అందుకు తను కారణమని తెలియగానే సిగ్గుతో కుంచించుకుపోయాడు. ఈ విషయం లక్ష్మమ్మకి తెలిస్తే తనని ఎంత అసహ్యించుకుంటుంది... కానీ తన బిడ్డ ... ఒకవైపు ఆ కుర్రాడి దీనస్థితి... మరోవైపు ఆస్పత్రిలో చావు బ్రతుకుల మధ్య తన బిడ్డ... రంగయ్య చేతిలోని పర్సు వంక చూశాడు. అది నిప్పు కణికలాగా అనిపించింది. మరి కాసేపు అదే తన బిడ్డకు ప్రాణదాతగా కనిపించింది. ఆ పర్సు పోగొట్టుకున్న కుర్రాడి భవిష్యత్తు అందులోనే ఉందని తెలుసుకున్నాడు. గుంపును చీల్చుకొని ఆ కుర్రాడి దగ్గరకెళ్ళి "ఇదిగో బాబూ, ఇప్పుడే నాకు దొరికింది'' అంటూ పర్సు ఇచ్చేశాడు. దాన్ని ఆత్రంగా అందుకున్న కుర్రాడు సంతోషంగా, "మీరెంత మంచివారండీ, మీకంతా మంచే జరుగుతుంది'' అని అన్నాడు. ఇల్లు చేరాడు రంగయ్య. లక్ష్మమ్మ గుడిసె ముందు దిగాలుపడి కూర్చునుంది. ఆమె కళ్ళల్లో దుఃఖం, కోపం - ఒకదాన్ని మించి మరోటి ఉన్నాయి. "మావా! నిన్ను మార్చి నా కొంప నేనే కూల్చుకున్నాను మావా!'' అంటూ పరిపరివిధాలుగా బాధపడింది. "మన చేతుల్లో ఏముందే'' అంటూ ఓదార్చబోయాడు రంగయ్య. "ఎందుకులేదు మావా! పద ఆ సూర్యకాంతమ్మ ఇంట్లో ఈ రాత్రికి ఎవరూ ఉండరు. స్టేషనుకాడికెళ్తారు. ఆరి అమ్మాయి అల్లుడు వత్తున్నారట. ఆళ్లొచ్చేలోపల నీ పని కానివ్వు. ఆరింట్లో ఎక్కడేమున్నాయో నాకు తెలుసులే పద..'' అంటూ తొందర చేసింది లక్ష్మమ్మ.

రంగయ్య నిర్ఘాంతపోయి చూసాడు. కడుపుతీపి భార్యని ఎంతగా దిగజార్చిందీ అని ఆశ్చర్యపోయాడు. "పాడు పనులు చేసి ఎందరి ఉసురోసుకుని ఇప్పుడిలా అనుభవిస్తున్నాము. ఇంకా ఆ పాపం మూట కట్టుకోలేనే'' అంటూ చేతకానివాడిలా కూర్చుండిపోయాడు. లక్ష్మమ్మ ఏడ్చింది, మొత్తుకుంది. అయినా రంగయ్య చలించలేదు. కాలం నిమిషాలు గంటల్లోకి మారిపోతున్నది. "మన ఖర్మ ప్రాప్తం ఇంతేనంటావా మావా! కన్నందుకు దాన్ని మట్టిపాలైనా చేయవా'' అంటూ ఏడుస్తూ రంగయ్యని హాస్పిటల్ వైపు లాక్కుపోయింది. హాస్పిటల్‌లో బెడ్‌మీద వాళ్ళ పాప సుఖంగా నిద్రపోతున్నది. నర్సు చెప్పగా అంతా విని రంగయ్య, లక్ష్మమ్మ పట్టరాని సంతోషంతో వెళ్ళి డాక్టరు బాబు కాళ్ళమీద పడి దండాలు పెట్టుకున్నారు. ఈ డాక్టరు బాబు పొద్దుటి డాక్టరు కాదు. నైట్ డ్యూటీలో వచ్చిన వేరే డాక్టరు. డ్యూటీలోకి రాగానే పాప పరిస్థితి చూసి ఎమర్జెన్సీ కేసుగా తీసుకుని తగిన వైద్యం చేసి తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వర్తించి డాక్టర్ల పేరు నిలబెట్టాడు. పాప ప్రాణం దక్కించాడు. రంగయ్య తన కథంతా డాక్టరుబాబుతో చెప్పుకున్నాడు. అంతావిని "మీకేమి భయం లేదు. మీ పాప ప్రమాద పరిస్థితి దాటిపోయింది. దానికి కారణం బహుశా నీ నిజాయితీయే కావచ్చు'' అని రంగయ్యని మెచ్చుకున్నాడు డాక్టర్. అంతేగాక ఉదయం డ్యూటీ అయి ఇంటికెళ్తూ తనతోపాటు రంగయ్యను తీసికెళ్ళాడు. తగిన జీతం, చిన్న ఇల్లు ఇచ్చి తోటమాలిగా పెట్టుకున్నాడు, పని ఉంటే ఏ మనిషికైనా రాణింపు ఉంటుందని. ❀




ఆటవిడుపు
పిల్లల సచిత్ర మాస పత్రిక
సెప్టెంబరు
2002 సంచిక
విడుదలయింది
మీ కాపీ కోసం
మా ఏజెంట్‌ని
అడగండి